సాక్షి వరంగల్

సోమవారం | 13 | ఫిబ్రవరి | 2023



చెరువు శిఖం కబ్జా

భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురైంది. సుమారు 20 ఎకరాల మేర కబ్జాకు గురైన భూమి విలువ సుమారు రూ.30కోట్ల వరకు ఉంటుంది.

- 8లో▸



మత సామరస్యానికి ప్రతీక

మత సామరస్యానికి ప్రతీకగా వరంగల్ ఉర్సు జాగీర్ ప్రాంతంలోని హజ్రత్ మామాఖ్ రబ్బానీ(రహమతుల్లా అలై) దర్గా నిలుస్తుంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/15^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాండ్ర కుమార్ వర్ధంతిని విజయవంతం చేయాలి



నర్సంపేట రూరల్: ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి, విగ్రహావిష్కరణ సభలు విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అన్నారు. నర్సంపేటలోని మార్క్స్ కాలనీలో ఆదివారం ఎంసీపీఐ(యూ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని కామ్రేడ్ తాండ్ర కుమార్ స్మారక స్థూపం నుంచి ముజాఫర్ అహ్మద్ నగర్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విగ్రహావిష్కరణ చేపట్టి మొదటి వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు జన్ను జమున, భవాని, ఫాతిమా, పుష్ప, మాధవి, ఐశ్వర్య, కోమల, పద్మ, చిలుకమ్మ, రవళి, అస్మా, వినోద, మనెమ్మ, జయ, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నాటికల పోటీలు

వర్ధన్నపేట: భారతీయ నాటక కళా సమితి వర్ధన్నపేట వారి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఈనెల 14 నుంచి 18 వరకు నాటిక పోటీలు–2023 నిర్వహిస్తున్నట్లు సమితి నిర్వాహకుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల(తెలంగాణ) ఐక్యవేదిక వారిచే కనువిప్పు నాటిక, అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే అతీతం నాటిక ప్రదర్శన ఉంటుంది. 15న మయూరి ఆర్ట్స్ వరంగల్ వారిచే ఉన్నది ఒకటే జీవితం నాటిక, కళానికేతన్ వీరన్నపాలెం వారిచే రాజరాజ చోరులు నాటిక ప్రదర్శన ఉంటుంది. 16న సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారిచే దారుణం, జాబిల్లి కల్చరల్ సొసైటీ నిజామాబాద్ వారిచే అసురవేదం ప్రదర్శన ఇస్తారు. 17న శ్రీసాయి ఆర్ట్స్ కొలుకలూరు వారిచే ప్రేమతో నాన్న, మద్దుకూరి ఆర్ట్స్ చిలుకలూరి పేట మృత్యుపత్రం రెండో ప్రదర్శన, 18న చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే చీకటి పువ్వు నాటిక ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని రాజేశ్వర్‌రావు తెలిపారు.

పోక్సో కేసు నమోదు చేయాలి

చెన్నారావుపేట: ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి యత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గద్దం సుభద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన దుండగున్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవ్వకుండా చూడాలని పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోక్సో, దిశ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

'బండా'కు 'చల్లా' శుభాకాంక్షలు



ఆత్మకూరు: తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన బండా ప్రకాశ్‌కు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- వివరాలు 10లో▸

పిల్లలకు కంటి పరీక్షలొద్దా?

- బాలల్లో అధికంగా దృష్టి లోపాలు
- 18 ఏళ్లు నిండిన వారికే పరీక్షలు, అద్దాలు
- పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వర్తించని 'కంటివెలుగు'
- వర్తింపజేయాలని తల్లిదండ్రుల వేడుకోలు



జిల్లాలో ఇలా..	
ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్	
పాఠశాలలు	724
విద్యార్థులు	45,887
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	11
ఫస్ట్ ఇయర్ విద్యార్థులు	1,250
సెకండ్ ఇయర్ విద్యార్థులు	1,370

గీసుకొండ: కరోనా కారణంగా ఆన్‌లైన్ క్లాసుల పేరిట చాలా మంది విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలయ్యారు. ఈనేపథ్యంలో వారిలో దృష్టి లోపాలు అధికమయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాలు నిండిన వారికే కంటి పరీక్షలు చేస్తూ ప్రభుత్వం అద్దాలిస్తోంది. దృష్టి లోపాలున్న 18 ఏళ్లలోపు ఉన్న విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు నిర్వహించాలని చిన్నారులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతంలో పరీక్షలు..

గతంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(బీఆర్ఎస్‌కే) పాఠశాలల్లో విద్యార్థులకు సాధారణ పరీక్షలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో చూపు మందగించిన 18 ఏళ్లలోపు విద్యార్థులు నిరుత్సాహపడుతున్నారు.

ఇబ్బందుల్లో విద్యార్థులు

వరంగల్ జిల్లాలో పాఠశాల, ఇంటర్ స్థాయిలో పలువురు విద్యార్థులు దృష్టి లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు బ్లాక్ బోర్డుపై రాసినవి కూడా కనిపించని వారు 10–20 శాతం మంది జిల్లాలో ఉన్నట్లు తెలుస్తోంది. పోషకాహార లోపం వల్ల అధిక శాతం గిరిజన విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్‌గా పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు తీసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.2500 వరకు ఖర్చు వస్తోంది. కంటి వెలుగులో పరీక్షలకు 18 ఏళ్లలోపు వారికి అవకాశమిస్తే చాలా మందికి ఆర్థిక భారం తగ్గుతుంది. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

మారిన జీవన శైలి..

మారుతున్న జీవన శైలి కారణంగా విద్యార్థులు కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. విద్యార్థులు నిత్యం టీవీలు, ఫోన్లు, ట్యాబ్‌లకు అతుక్కుపోతున్నారు. కాంతి ఎక్కువ, లేదా తక్కువ ఉండే వాటిని తరచూ చూడడం వల్ల వారికి దృష్టి లోపం ఏర్పడుతోందని, దీంతో చిన్నతనంలోనే సోడాబుడ్డి కళ్లద్దాలతో పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు హాజరవుతున్న తీరు కనిపిస్తోంది. ముఖ్యంగా 'మియోపియా' (దూరంగా ఉన్నవి అస్పష్టంగా కనిపిస్తుండడం)తో చాలామంది విద్యార్థులు బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. 18 ఏళ్లలోపు విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు చేసి చికిత్సలు అందించాలని, అవసరమైతే కళ్లద్దాలు పంపిణీ చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పరీక్షలు చేస్తే విద్యార్థులకు మేలు



కంటి వెలుగును పాఠశాల విద్యార్థులకు వర్తింపజేయాలి. వారికి కంటి పరీక్షలు చేసి అవసరమైన అద్దాలు పంపిణీ చేయాలి. అవసరం ఉన్నవారికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అందించాలి. అవసరమైతే కంటి ఆపరేషన్లు చేసేలా ప్రభుత్వం ఆలోచించాలి.

- కర్ణకంటి రామ్మూర్తి, హెడ్మాస్టర్, ఎంపీపీఎస్, మందపల్లి

మాకూ కంటి పరీక్షలు చేయాలి



ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు చేయాలి. విద్యార్థుల్లో చాలా మంది దృష్టి లోపంతో బాధపడుతున్నవారు ఉన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునే స్తోమత లేనివారున్నారు. ప్రభుత్వం పిల్లలకు సైతం కంటి వైద్యం ఉచితంగా అందించాలి.

- ఎండీ హుజ్మా అంజుమ్, టెన్త్ విద్యార్థి, గీసుకొండ జెడ్పీ స్కూల్

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- నేటి నుంచి ఓరియంటేషన్, మోటివేషన్ తరగతులు
- 15 నుంచి ప్రత్యేక తరగతులు
- విద్యార్థులకు స్నాక్స్



రాయపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు(ఫైల్)

కాళోజీ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించారు. సోమవారం నుంచి 15వ తేదీ వరకు ఓరియంటేషన్, మోటివేషన్ తరగతులు నిర్వహించనున్నారు. ఈనెల 15 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈమేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని డీఈఓ వాసంతి ఆదేశించారు.

నేటి నుంచి ఓరియంటేషన్ క్లాస్‌లు

సోమవారం నుంచి జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో చెన్నారావుపేట, వర్ధన్నపేటలోని రెండు కాంప్లెక్స్ కేంద్రాల్లో, వరంగల్, ఖిలా వరంగల్ కేంద్రాల్లో 5 సెంటర్లలో, 6 సెంటర్లలో మిగిలిన మండలాల్లో 3 సెంటర్లలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలోని పదో తరగతి పరీక్షలకు 5,013 మంది బాలురు, 4,715 మంది బాలికలు మొత్తం 9,728 మంది విద్యార్థులు హాజరవనున్నారు. ఎస్సీఈఆర్టీ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రతీ సంవత్సరం మాదిరిగానే జనవరి 6 నుంచి 40 రోజుల పాటు రోజువారీగా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి బోధించనున్నారు.

వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం



పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వారం తప్ప పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశాం.

- కృష్ణమూర్తి, డీసీఈబీ కార్యదర్శి

విద్యార్థులకు స్నాక్స్



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా ఈనెల 15 నుంచి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నాం. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే ఓరియంటేషన్, మోటివేషన్ తరగతుల్లో విద్యార్థులకు పరీక్షలపై భయం తొలగించి, పోటీతత్వం పెరిగేలా ప్రోత్సహిస్తాం.

- డి.వాసంతి, డీఈఓ

---

40 ఏళ్లు.. 500 మంది విద్యార్థులు

- ఐదు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ రమేశ్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గీసుకొండ: చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపి బాల్య స్మృతుల్ని నెమరు వేసుకున్నారు. మండలంలోని ఎలుకుర్తి జెడ్పీ పాఠశాలలో 1968–73 వరకు చదివిన ఐదు బ్యాచ్‌ల టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి, నిమ్స్ లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో 40 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులు 500 మంది కలుసుకుని తీపి గుర్తులను నెమరేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కాగా.. డాక్టర్ మార్త రమేశ్ మాట్లాడుతూ.. చదువుకున్న బడి అభివృద్ధికి పూర్వ విద్యార్థులకు తోచిన విధంగా సాయం అందించాలన్నారు. ఎంపీపీ బీమగాని సౌజన్య, ఆంగ్ల రచయిత దామోదర్, ఏపీఓ శ్రీవాణి, అడ్వకేట్ అనసూయ, నారాయణ రెడ్డి, సర్పంచ్ పూండ్రు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎలియాస్, రాజమౌళి, అనంత్‌రెడ్డి, సర్వేశం, మాజీ జెడ్పీటీసీ సూరం రంగారెడ్డి, మాజీ ఎంఈఓ సూరం జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డి, దనేకుల రాంబాబు, హెచ్ఎం బాలకుమార్, రవికృష్ణ, సత్యనారాయణ, తిప్పారపు రవీందర్, రమేశ్, మైదంశెట్టి సాంబయ్య, బొడిగె శోభ, రాజేశ్వర్‌రావు, దనేకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమరజీవి కామ్రేడ్ ఎలమకంటి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్



మాట్లాడుతున్న బాల్‌రాజ్

వర్ధన్నపేట: పేదలు, కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన అమరజీవి కామ్రేడ్ ఎలమకంటి శ్రీనివాస్ అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ కొనియాడారు. ఆదివారం మండల కేంద్రంలో శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సభను సీపీఐ నాయకులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాల్‌రాజ్ మాట్లాడుతూ.. సమసమాజ నిర్మాణానికి మనమంతా పని చేయడమే శ్రీనివాస్‌కు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆరెల్లి రవి, జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వరుడు, జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ, నాయకులు ఆరెల్లి ప్రభాకర్, కడమంచి యాదగిరి, మేకల చిన్నప్ప, భూపతి కుమార్, లక్ష్మి నర్సయ్య, జలగం భిక్షపతి, నాగేశ్వర్‌రావు, కుక్కల మల్లయ్య, కుక్కల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాల్ని ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి
- నల్లబెల్లి మండలంలో సాగిన జోడో యాత్ర




మాట్లాడుతున్న దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలు ఎండగట్టాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని కొండాయిల్‌పల్లి, నల్లబెల్లి, లెంకాలపల్లి, నందిగామ, రేలకుంటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాధవరెడ్డి ఆదివారం పాదయాత్ర చేపట్టారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. రైతులు, కూలీలు, గీత కార్మికులు, నిరుద్యోగులను పలుకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మాధవరెడ్డి ప్రజలనుద్దేశిస్తూ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చాయన్నారు. ఈపార్టీలు కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మేధావులు జనంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణను మిగులు బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పిన కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ప్రాజెక్టుల పేరుతో తెలంగాణను అప్పుల పాలు చేశాడని ఆరోపించారు. ప్రస్తుతం కరెంటు కోతలతో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్బాయి శ్రీనివాస్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, చిట్యాల తిరుపతిరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, వేముల సాంబయ్య, ఎర్రెల్లి బాబు, ఒర్సు తిరుపతి, పార్వతమ్మ, రఘుపతిరావు, అశోక్, శేఖర్, శివారెడ్డి, కొంరారెడ్డి, సురేశ్, చిల్పూరి జ్యోతి, సంపత్‌రెడ్డి, బాష్‌సింగ్, కట్టయ్య, రఘుపతి, అశోక్, ఉపేందర్‌రెడ్డి, బత్తిని మల్లయ్య పాల్గొన్నారు.

నిధులు కావాలంటే.. నివేదికలివ్వండి..

- ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల ప్రారంభానికి సిద్ధం చేయండి
- రూ.25కోట్లతో హనుమకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆధునికీకరణ
- నాలాల మరమ్మతు పనులు నిరంతరాయంగా సాగాలి
- హైదరాబాద్‌లో జరిగిన సమీక్షలో మంత్రి కేటీఆర్



వరంగల్ అర్బన్: మహా నగరంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ వరంగల్, 'కుడా' ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. పలు పథకాలకు నిధులు కావాలని అధికారులు విన్నవించగా.. నివేదికలు ఇస్తే నిధులిస్తామన్నారు. త్వరలోనే వరంగల్ పర్యటన ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్ మొదటి అంతస్తులో ఆదివారం జరిగిన సమీక్షలో మంత్రి కేటీఆర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, పురపాలక శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్, సీడీఎంఏ డాక్టర్ సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, బల్దియా కమిషనర్ ప్రావీణ్య, 'కుడా' వింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్దియా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల వారీగా సీఎంఏ, జీఎఫ్, పీపీ, ఎఫ్‌డీఆర్ అభివృద్ధి పనులు, పురోగతి, ఐవీఎస్ఎంఎస్, వైకుంఠధామాలు, బస్తీ దవాఖానాలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు తదితర పనులపై ఆరా తీశారు. అభివృద్ధి పనులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. నగర అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఈనెల 15న రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ పర్యటిస్తారని, పలు అంశాలపై చర్చించాలని మంత్రి ఆదేశించారు.

'కుడా'కే ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు

- ఇన్నర్ రింగ్ రోడ్డు అభివృద్ధి పనులను 'కుడా' చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఆర్అండ్‌బీ వద్ద ఉన్న రూ.50కోట్ల నిధులతో ఫేస్–1లో ఖమ్మం రోడ్డులోని నాయుడు పెట్రోల్ పంపు నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు చేపట్టాలన్నారు.
- వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునీకరణకు రూ.75కోట్లు మంజూరైనందున, హనుమకొండ ఆర్టీసీ బస్ స్టేషన్ పునరుద్ధరణకు రూ.25కోట్ల నిధులను మంత్రి కేటీఆర్ ప్రకటించారు. త్వరలో పనుల ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.
- స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులపై మంత్రి ఆరా తీయగా.. నిధుల కొరత ఉందంటూ అధికారులు సమాధానం ఇచ్చారు. దీంతో నివేదికలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. తాజాగా బడ్జెట్‌లో రూ.200కోట్లు కేటాయించినట్లు మంత్రి గుర్తు చేశారు.
- వర్షాలు కురిస్తేనే నాలాలు గుర్తుకు రావడం సరికాదని, నిరంతరాయంగా నాలా ఆధునీకరణ పనులు చేపట్టాలని మంత్రి కేటీఆర్ బల్దియా ఇంజనీర్లకు చురకలు అంటించారు. సమగ్ర ప్లాన్ తయారు చేసి సమర్పించారు. నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా.. గ్యాప్స్ లేకుండా చూడాలన్నారు. ఎక్కడికక్కడ మరమ్మతులు చేయాలన్నారు. హరితహారం, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాలు, శ్మశాన వాటికలు తదితర అభివృద్ధి పనులపై మంత్రి చర్చించారు.

---

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- హాజరుకానున్న 5,636 మంది విద్యార్థులు
- మూడు దశల్లో పరీక్షలు




కాళోజీ సెంటర్: ఈనెల 15 నుంచి మార్చి 2 వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈపరీక్షలు జరుగుతాయి. మూడు దశల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలను మొదటి దశ 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 13 జనరల్, 7 ఒకేషనల్, రెండో దశ 21వ తేదీ నుంచి 25 వరకు 10 జనరల్, 2 ఒకేషనల్, మూడో దశ 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు 13 జనరల్, 4 ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

హాల్ టికెట్లివ్వాలని ఆదేశం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్ జూనియర్ కళాశాలు, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, కేజీబీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు ఈప్రాక్టికల్స్ పరీక్షలకు విద్యార్థులందరికీ తమ కళాశాల లాగిన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలని, ఇప్పటికే ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ఆదేశించారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 5,636 మంది ఈ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఆయా కళాశాలల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యను బట్టి వారి పరీక్ష తేదీలను నిర్ణయించారు. ప్రతీ విద్యార్థి హాల్ టికెట్‌లో సెంటర్ పేరు, పరీక్ష తేదీ, సబ్జెక్టు సరిచూసుకుని పరీక్షలకు హాజరవ్వాలని అధికారులు ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేసి కళాశాల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి..



ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం.

- కాక మాధవ రావు, ఇంటర్ విద్యాశాఖ అధికారి

ఐలోనిలో భక్తుల సందడి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఐనవోలు: వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం ఐనవోలుకు తరలివచ్చిన భక్తులు మల్లికార్జునస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో మల్లన్న సన్నిధిలో సందడి ప్రారంభమైంది. స్వామివారికి నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించి.. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలతో స్వామివారిని అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని వారి పితృదేవతలను పూజించారు. అదే విధంగా బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తుల రద్దీ అధికం కాగా.. ప్రత్యేక దర్శనం టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు.

డాగ్ షో..

200 శునకాలతో ప్రదర్శన



పోటీలో పాల్గొన్న జర్మన్ షఫర్డ్



మెడులహోడ్ జాతి కుక్క

హన్మకొండ: డాగ్ షో నగరవాసులను ఆకట్టుకుంది. హనుమకొండ సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన డాగ్ షోలో 50 జాతులకు చెందిన 200 శునకాలు పాల్గొన్నాయి. కాకతీయ కెన్నల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి డాగ్ షోను న్యాయనిర్ణేతలు, ఇండోనేషియాకు చెందిన డానియల్ క్వీ, సింగపూర్‌కు చెందిన కెల్విన్ ఎన్.జి. ప్రారంభించారు. రెండు రింగ్‌లలో యజమానులు తమ శునకాల సామర్థ్యాన్ని ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు శునకాల ఫిట్‌నెస్‌ను పరిశీలించి విజేతలను ప్రకటించారు. హైదరాబాద్‌తోపాటు దేశంలోని ఆయా ప్రాంతాల నుంచి యజమానులు తమ శునకాలతో చేరుకుని ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు కె.రామస్వామి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కె.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిస్ ఉర్ రషీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా అందజేసే దరఖాస్తులను స్వీకరిస్తామని, సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మత సామరస్యానికి ప్రతీక
హజ్రత్ మాషూఖ్ రబ్బాని


సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

- నేటి నుంచి దర్గా ఉత్సవాలు
- వివిధ ప్రాంతాల నుంచి పలువురి రాక
- ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు


హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గా(ఫైల్)

న్యూశాయంపేట/కరీమాబాద్ : మతసామరస్యానికి ప్రతీకగా వరంగల్ ఉర్సు జాగీర్ ప్రాంతంలోని హజ్రత్ మాషూఖ్ రబ్బాని (రహమతుల్లా అలై) దర్గా నిలుస్తుంది. 467 ఏళ్ల చరిత్ర ఉన్న దర్గా ఉర్సు ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉత్సవాల ప్రధానఘట్టం సంధల్(గంధం) ఊరేగింపు సోమవారం రాత్రి ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామువరకు సాగుతుంది. ఫకీర్ల విన్యాసాలు, మేళతాళాలతో హజ్రత్ మాషూఖ్ రబ్బాని పవిత్ర సమాధి వరకు సాగనుంది. ఊరేగింపులో కుల మతాలకతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటారు. ఉర్సు జాగీర్‌లోని మొదట పీఠాధిపతి గడీ నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకవచ్చి సమాధిపై లేపనం చేస్తారు. అనంతరం ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహిస్తారు.

పవిత్ర గంధం కార్యక్రమం...

ఉర్సు జాగీర్‌లోని పీఠాధిపతి ఇంటి నుంచి సోమవారం రాత్రి గంధం ఊరేగింపు ప్రారంభం అవుతుంది. 14వ తేదీ రాత్రి వరకు ఉర్సు జరుగుతుంది. అనంతరం ప్రసాద వితరణ, నాతియా మైఫిల్, సందల్‌ఖాని, షబ్‌చిరాఖ్ వేడుక ఉంటుంది. బుధవారం ఉదయం పవిత్ర ఖురాన్‌పఠనం, సలాం, పాతిహా, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి....

హజ్రత్ మాషూఖ్ రబ్బానీ ఉర్సు ఉత్సవాల్లో కుల మతాలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పీఠాధిపతి సయ్యద్ మోహినొద్దీన్ అహ్మద్ భక్తియార్ ఖాద్రీ తెలిపారు. ఆదివారం దర్గా గడిలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సయ్యద్ జమాలుద్దీన్ అహ్మద్ ఖాద్రీ, సయ్యద్ సాబిర్ ఆలం ఖాద్రీ, సయ్యద్ హబీబ్ ఆలం ఖాద్రీలు పాల్గొన్నారు.

విస్తృత ఏర్పాట్లు

ఉర్సు ఉత్సవాలకు ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, కలెక్టర్ యంత్రాంగం, మహానగర పాలక సంస్థ పోలీసులు తమ సిబ్బందికి పలు సూచనలు చేసి ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

దర్గా చరిత్ర..

హజ్రత్ మాషూఖ్ రబ్బాని(రహమతుల్లా ఆలై) ప్రపంచంలోని సమస్త మానవాళి సన్మార్గంలో పయనించాలనే ఉద్దేశ్యంతో భక్తిమార్గంలో బోధనలు చేస్తూ ఈ ప్రాంతానికి విచ్చేశారని పూర్వీకులు చెపుతున్నారు. హజ్రత్ మాషూఖ్ రబ్బాని గొప్పతనం, మహిమల గురించి స్థానికులు ఇప్పటికీ చర్చించుకుంటారు. ఇస్లాం బోధనలు, ప్రచారం కోసం దేశానికి ముఖ్యంగా దక్షిణభారత్‌లో గొప్ప స్థానాన్ని పొందాడు.

క్లుప్తంగా

వంతెనపై బస్సుటైర్ పంక్చర్

- రెండు గంటలు ట్రాఫిక్ జామ్
- వాహనదారుల ఇబ్బందులు


నిలిచిన వాహనాలు

హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎల్లాపురం వంతెనపై ఆర్టీసీ బస్సు టైర్‌పంక్చర్ అయి నిలిచిపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. ఆదివారం సాయంత్రం హనుమకొండ వైపునకు బయలుదేరింది. ఎల్లాపురం బ్రిడ్జి పైకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో నిలిచిపోయింది. ఈక్రమంలో ట్రాఫిక్ జామ్‌తో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నలుగురిపై గృహహింస చట్టం కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శిఖార్‌ఖానగడ్డ ప్రాంతానికి చెందిన బాదావత్ శిరీష తనను అత్తమామలు, ఆడపడుచు, భర్త వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం తెలిపారు. శిరీషకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బాదావత్ వినోద్‌తో 2016లో వివాహమైంది. ఆమె అత్త పద్మ, మామ తులసీరాం, ఆడబిడ్డ మౌనిక తదితరులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. బాధితురాలు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దీపికారెడ్డికి ఫిర్యాదు చేసిందన్నారు.

వ్యక్తిపై కేసు


కూలీలను పరిశీలిస్తున్న పోలీసులు

వాజేడు : బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. మండల పరిధిలోని పేరూరుకు చెందిన బొల్లె యేసు మిర్చి కాయలను ఏరడానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసకూలీలను తీసుకొచ్చాడు. అందులో 13 ఏళ్ల వయస్సు ఉన్న పోయం సుందరి, పోయం సుమిత్ర ఉన్నారు. వారితో మిర్చితోటలో కాయలను ఏరిస్తుండగా చైల్డ్‌లైన్ టీముకు చెందిన రమ్య ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి వారిని పనిలో నుంచి తప్పించారు. అనంతరం బొల్లె యేసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను ఎవరూ పనిలో పెట్టుకున్న చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పు ఇచ్చిన వారు దూషించారని..

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య


లచ్చిరాం(ఫైల్)

నెక్కొండ : అప్పు ఇచ్చిన వారు దూషించారని మనస్తాపానికి గురై ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వెంకటాపురం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, తండావాసులు తెలిపిన వివరాల పకారం.. గ్రామ శివారు గంగదేవితండాకు చెందిన జాటోతు లచ్చిరాం(45)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరంలో వరి, మరో ఎకరంలో పత్తి పంట సాగుచేశాడు. వ్యవసాయం, ఇతర అవసరాల కోసం అదే తండాకు చెందిన జాటోతు చక్రు వద్ద రెండేళ్ల క్రితం రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అయితే సరైన దిగుబడి రాక అప్పు చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ క్రమంలో ఈనెల 11న చక్రు భార్య జమ్లీ అప్పు విషయమై లచ్చిరాం ఇంటికి వెళ్లి నిలదీసింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో జమ్లీ దుర్భాషలాడింది. తీసుకున్న అప్పు చెల్లించకుండా అరెకరం భూమి ఎలా కొనుగోలు చేస్తావని నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన లచ్చిరాం సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు చేరుకొని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు లచ్చిరాం కోసం రాత్రి నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు వెతికి చివరికి వ్యవసాయ భూమి వద్దకు చేరుకోగా లచ్చిరాం విగత జీవిగా కనిపించాడు. దీంతో అప్పుల వారు వేధించడంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ మృతదేహాన్ని చక్రు ఇంటివద్ద వేసి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఉపసర్పంచ్, మృతుడి భార్య బూలి(లలిత) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని వారు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారులు నవీన్, పండు ఉన్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధం


అలింపూర్‌లోని జామాయిల్ తోటలో చెలరేగుతున్న మంటలు

బచ్చన్నపేట : మండలంలోని ఆలింపూర్‌లో ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దండ్యాల మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి లతో పాటు పలువురి 35 ఎకరాల జామాయిల్ తోట ఉంది. ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగగా గమనించిన రైతులు జనగామ ఫైర్‌స్టేషన్‌కు ఫోన్‌చేయగా ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలార్పింది. ఈ ఘటనలో సుమారు 25 ఎకరాల వరకు తోట కాలిపోయింది. బాధిత రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో.. ముగ్గురికి తీవ్రగాయాలు

చెన్నారావుపేట: బైక్‌ను తప్పించబోయి ఓ ఆటో చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోజిపేటకు చెందిన ఆటో నర్సంపేట నుంచి ఆరుగురు ప్యాసింజర్లను తీసుకొని జోజిపేటకు వెళ్తున్నాడు. చెన్నారావుపేట గ్రామశివారులోని వైన్స్ షాపు వద్దకు రాగానే వేలుబల్లికి చెందిన ఏపీ 36 డి 4264 నంబర్ గల ద్విచక్రవాహనదారుడు వైన్స్‌షాపు నుంచి ఒక్కసారిగా రోడ్డు పైకి రావడంతో ఆటోడ్రైవర్ బైక్ వ్యక్తిని తప్పించబోయి అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై తోట మహేందర్ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

యువకుడిపై కత్తిపీటతో దాడి

చెన్నారావుపేట: పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని యువకుడిపై కత్తిపీటతో దాడి చేసిన ఘటన మండలంలోని లింగగిరిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన బూరుగు రాజేందర్ ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ఊర చెరువు సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన చిందం విజయ్ పాత కక్షలను మనసులో పెట్టుకొని కత్తిపీటతో రాజేందర్‌పై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో రాజేందర్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు చికత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు తండ్రి బూరుగు చిన్న సూరయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


శవాన్ని బావినుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

పరకాల: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు పరకాల మండలం మల్లక్‌పేట గ్రామానికి చెందిన దొమ్మాటి కుమారస్వామి(45)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కుమారస్వామి నిత్యం మద్యం మత్తులో ఉంటూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఇంట్లో వస్తువులు అమ్ముకుంటూ మద్యం మత్తులో ఇంటికి చేరుకొని భర్త వేధింపులు భరించలేక పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసినా ఫలితం కనిపించకపోయింది. ఏడాది క్రితం భార్య సువర్ణ పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం తాగడం మానుకోవాలని మందలించిన తండ్రిపై ఈ నెల 3న దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారస్వామి ఆదివారం మల్లక్‌పేట గ్రామ కర్ణకుంట చెరువు శివారులోని బైరెడ్డి తిరుపతిరెడ్డి వ్యవసాయలో బావిలో కుళ్లిపోయిన శవంగా గ్రామస్తులకు కనిపించాడు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు తమకు ఎవరిపై అనుమానం లేదని మద్యం మత్తులోనే కాలు జారి వ్యవసాయబావిలో పడి చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుళ్లిన శవాన్ని బయటకు తీయడానికి గ్రామస్తులు ఎవరూ కూడా ముందుకు రాకపోవడంతో పరకాల సీఐ పుల్యాల కిషన్ గత ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. మృతుడుకి భార్య సువర్ణ, కుమారుడు ఉన్నారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు..

మడికొండ: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన రాంపూర్ శివారులోని స్టేషన్‌పెండ్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నూనెముంతల గోపాల్ (72) ప్రతీరోజు మాదిరిగానే ఆదివారం ఉదయం కల్లు తీయడానికి స్టేషన్‌పెండ్యాల సమీపంలోని తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి ధర్మసాగర్ పోలీసులు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.


గోపాల్ మృతదేహం

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ..

గీసుకొండ: మండలంలోని వరంగల్ –నర్సంపేట రహదారి కోటగండి పీడీఆర్ గార్డెన్స్ సమీపంలో ఇటుక ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో దానిపై కూర్చున్న కూలీ కిందపడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ వెంకన్న, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన సింగిరెడ్డి కృష్ణ(30) ఊకల్ గ్రామశివారులోని నెల్లుట్ల మల్లేశం ఇటుకబట్టీ పనికి వెళ్లి అతడి ట్రాక్టర్‌లో ఇటుకలు లోడ్ చేసి ఉదయం వరంగల్‌కు తీసుకుని వెళ్తున్నారు. డ్రైవర్ దాట్ల ప్రశాంత్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లింది. ట్రాలీ టైరు సింగిరెడ్డి కృష్ణ తలపై నుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


సింగిరెడ్డి కృష్ణ(ఫైల్)

వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

హసన్‌పర్తి: కాకతీయ పోలీస్‌స్టేషన్ పరిధి పెగడపల్లిలోని ఓ వ్యవసాయ పొలంలో 60 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన చింతల సాంబయ్య రైతు నారుమడిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఉన్నాడనే సమాచారం మేరకు ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తి మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై చెప్పారు. వివరాలకు కేయూసీ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రూ. 30 కోట్ల విలువైన చెరువు శిఖం కబ్జా


చెరువులో ప్లాట్లు


భీమారంలోని శ్యామల చెరువు

- చెరువులో వెలసిన ప్లాట్లు...
- దర్జాగా 'రియల్' వ్యాపారం
- ఫిర్యాదులు అందాయి : డీఈఈ రాజు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురైంది. సుమారు 20 ఎకరాల మేరకు కబ్జాకు గురైన భూమి విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉంటోంది. ఇక్కడ ఎకరం భూమి విలువ రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లకు పలుకుతుంది. చెరువును కేంద్రంగా చేసుకుని రియల్ దందా కొనసాగిస్తున్నారు. ఏకంగా 20 ఎకరాల శిఖాన్ని ఆక్రమించుకున్నారు. ఈ భూమిని ప్లాట్లుగా చేసి వ్యాపారం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే భీమారంలోని శ్యామలచెరువు సుమారు 67.20 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఈ చెరువు కింద 400 ఎకరాల ఆయకట్టు ఉండేది. అయితే కాలక్రమేణా నగరంలో విస్తరించడంతో వ్యవసాయ భూములు, వ్యవసాయేతరంగా మారాయి. ప్రస్తుతం ఈ చెరువు పరిధిలో సాగుభూమి లేకుండా పోయింది. అయితే భూగర్భజలాలు పడిపోకుండా ఉండేందుకు స్థానికులు చెరువును కాపాడుతూ వస్తున్నారు. అయితే రియల్టర్లు మాత్రం చెరువును మింగుతున్నారు..

రిజిస్ట్రేషన్ ఓ సర్వే నంబర్.... ప్లాట్లు మరో నంబర్‌లో..

అయితే పక్కనే పట్టాదారుడితో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేసుకుని చెరువు శిఖంలోకి (చెరువు సర్వేనంబర్ 642) వచ్చి దర్జాగా ప్లాట్లు చేసుకున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కరిద్దరు కాదు పదుల సంఖ్యలో రియల్టర్లు చెరువును కబ్జా చేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మించి ప్లాట్లుగా చేశారు. మరికొంతమంది చెరువును ప్లాట్లుగా విభజించారు. రియల్టర్లు కాకుండా కొంతమంది శిఖాన్ని ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారుల సహకారం...

కాగా, అధికారులు ఇష్టం వచ్చినట్లు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రియల్టర్లు నయానో బయానో ఇచ్చి అప్పుడు అనుమతి తీసుకున్నారు. చెరువు సమీపంలో ఇళ్ల అనుమతికి తప్పని సరిగా నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి. అయితే మామూళ్లు పుచ్చుకున్న అధికారులు అవేమి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వేకు డిమాండ్..

శ్యామల చెరువు సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్‌గా మారింది. అధికార పార్టీ నాయకుల సహకారంతోనే రియల్‌దందా సాగుతోందని వాట్సాప్‌లో వైరల్ అయింది.

ఫిర్యాదులు అందాయి

చెరువు కబ్జా అయినట్లు ఫిర్యాదులు అందాయి. నాలుగైదు రోజుల్లో సర్వే చేపడుతాం. ఎఫ్‌టీఎల్ వరకు హద్దులు నిర్ధారిస్తాం. ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తాం.

– రాజు, నీటిపారుదలశాఖ, డీఈఈ


గూగుల్ మ్యాప్

మామిడి రైతులూ..జాగ్రత్త !


మామిడి పూతలో వస్తున్న తెగుళ్లు

విరగపూసిన మామిడి పూత

- పూతకు తెగుళ్ల బెడద
- సస్యరక్షణ చర్యలు పాటించకపోతే నష్టం

కరీమాబాద్: ప్రస్తుతం మామిడి పూతదశలో ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ అనుకూలంగా పూత బాగా వచ్చినప్పటికీ చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి రక్షించుకోకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు ఎప్పటికప్పుడు పూతను పరిశీలించుకుంటూ సస్యరక్షణ చర్యలు పాటించకపోతే మొదటికే మోసం వస్తుందని సూచిస్తున్నారు. డిసెంబర్ నుంచి ప్రారంభమయ్యే పూత ఫిబ్రవరి వరకు వస్తుందన్నారు.

పూత దశలో వచ్చే తెగుళ్లు...

మామిడిలో పూత దశలో ఎక్కువగా బూడిద, నల్లమచ్చ తెగుళ్లు, తేనెమంచు, తామర, పూత పురుగుల పూతను ఆశించడంతో కాయ దిగుబడి తగ్గుతుంది.

బూడిద తెగులు లక్షణాలు....

వాతావరణం రాత్రిపూట చల్లగా పగటి పూట వెచ్చగా ఉన్నప్పుడు ఈ తెగులు ఉదృతి ఎక్కువగా ఉంటుంది. పూతకాండం, పూల, చిన్నపిందెలపై తెల్లని పొడి లాంటి బూజు పదార్థంగా చేరడంతో పూత, కాత రాలిపోతుంది.

నివారణ కోసం...

మొగ్గలు కనిపించే దశలో 1 లీటరు నీటిలో 3 గ్రాముల గంధకం కలిపి పిచికారి చేయాలి. పరిస్థితులను బట్టి హెక్సాకోనజోల్, ప్రొపికోనజోల్, డినోకాఫ్, ట్రై డిమార్ఫ్ లాంటివి మోతాదు ప్రకారం పిచికారి చేయాలి.

ఆకుపచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు...

పొగమంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్ల ఉధృతి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఇవి మొదటగా లేత ఆకులు, పూలను ఆశిస్తాయి. ఆకులమీద గోధుమరంగులో మచ్చలు ఏర్పడి ఆకులు పండు బారి రాలిపోతాయి. రెమ్మలపైన కూడా నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు, పూలు మాడిపోయి కాయలు రాలిపోతాయి.

నివారణ కోసం....

పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, బోర్డో కలిపి పిచికారి చేయాలి. కార్బండిజమ్, థయోఫినేట్ లాంటి మందులు మోతాదులో పిచికారి చేయాలి.

పూత దశలో పాటించాల్సిన పద్ధతులు..

- భూమిలో తేమ కోసం పూత వచ్చిన తర్వాత ప్రతీ 10–15 రోజులకోసారి నీటి తడి పెట్టాలి.
- చలి ఎక్కువ ఉంటే పూత రావడం ఆలస్యమవుతుంది. కాబట్టి 10 గ్రాముల మల్టీ–కే (పొటాషియం నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి పిచికారి చేయాలి.
- పూత సమయంలో రైతులు కొమ్మ కత్తిరింపు, దున్నడం లాంటివి చేయకుండా మొక్కలకు విశ్రాంతినివ్వాలి.

తేనె మంచు పురుగు...

తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండాలు, పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చడం మూలంగా ఆకుల చివర్లో మాడిపోయి పూత మాడిపోతుంది. పిందెలు రాలిపోతాయి. ఆకులు, కాండం, కాయలపై మసి పొర ఏర్పడుతుంది.

నివారణ కోసం..

ఈ పురుగు నివారణ కోసం మోనోక్రోటోఫాస్, డైక్లోరోవాస్, డైమెథోయేట్, జిథైల్‌డెమటాన్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదులో పిచికారి చేయాలి.

పూత పురుగు...

ఈ పురుగు అరుదుగా కనిపిస్తుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టడం ద్వారా వచ్చిన పిల్లపురుగులు పూల కాడలోకి చొచ్చుకుపోయి కాడ భాగాన్ని తింటాయి. దీంతో పూల కాడలు వంగిపోయి ఎండిపోతాయి. పూత రాలిపోతుంది.

నివారణ కోసం....

మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, పాస్ఫమిడాన్, డైక్లోరోవస్ సరైన మోతాదులో పిచికారి చేయాలి

తామర పురుగు..

గత సంవత్సరం ఈ పురుగు మామిడితోటలతో పాటు మిరప పంటలను నష్టపరిచింది. మామిడి పంట పూత సమయంలో రసం పీల్చడం మూలంగా పూత ఎండిపోయి రాలిపోతుంది. తామర, మంచు పురుగులు మంగు తెగులును వ్యాప్తి చెందేలా చేస్తాయి.

నివారణ కోసం..

ఈ పురుగు నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్, థయామితగ్జామ్‌లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో వస్తున్న మార్పులను రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. పూత, కాండంలను పరిశీలిస్తూ ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకుంటూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకున్నట్లయితే మామిడి పూత రాలకుండా చూసుకోవచ్చు. మందుల పిచికారి కూడా వారి సూచనల మేరకే మోతాదు ప్రకారం చేయాలి.

– డాక్టర్ అగుర్ల రాజు, శాస్త్రవేత్త- కేవీకే మామునూరు